ప్రజాశక్తి

గురువారం 21 సెప్టెంబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఘనంగా ఉక్కు రక్షణ యాత్ర ప్రారంభం



జెండా ఊపి ఉక్కు రక్షణ బైకు యాత్రను ప్రారంభిస్తున్న వి.శ్రీనివాసరావు

- జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భారీ సభ
- స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలంటే బిజెపిని ఓడించాల్సిందే : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- అడుగడుగునా యాత్రకు అపూర్వ స్పందన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ బారి నుంచి రక్షించుకునే క్రమంలో సిపిఎం ఆధ్వర్యాన ఉత్తరాంధ్రలో తలపెట్టిన ఉక్కు రక్షణ బైకు యాత్ర బుధవారం విశాఖలో ఘనంగా ప్రారంభ మైంది. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఈ యాత్రను జెండా ఊపి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యావత్ ఆంధ్ర రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి దిక్సూచిగా నిలిచిందని, దీన్ని కాపాడుకోవడానికి ఎంతటి త్యాగాలకైనా సిద్ధమని ఉద్ఘాటించారు.

తొలుత ముఖ్య అతిథి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖను రాజధానిని చేస్తామన్న వైసిపి నేతల మాటలను ఉటంకిస్తూ ముందు పారిశ్రామిక రాజధానైన విశాఖను కాపాడండి అంటూ హితవు పలికారు. విశాఖను ఉన్నదున్నట్టు వుంచకుండా ఇక్కడి ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని బిజెపి నాశనం చేస్తుంటే ఏమీ అనక శ్మశానంలా మారాక రాజధాని చేస్తారా ? అంటూ ప్రశ్నించారు. బిజెపిని ఓడించడం ద్వారానే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకో గలమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ప్రజా యాత్రగా ఉక్కు రక్షణ బైకు యాత్ర సాగనుందన్నారు. ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లో ఈ నెల 29 వరకూ 1150 కిలోమీటర్ల మేర ఈ యాత్ర కొనసాగు తుందన్నారు. ఉక్కు ఉద్యమం ప్రభుత్వాల పునాదులను కదులుస్తుందన్నారు. నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రాష్ట్రానికి అత్యంత కీలకమైన భారీ పరిశ్రమని తెలిపారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోనే రిజర్వేషన్ల అమలు సాధ్యమన్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ అందించి వేలాది మందిని కాపాడిన సంజీవనిగా మిగతా 2లో..



తగరపువలసలో కళాకారుల ఆటాపాట



ప్రారంభ సభలో అభివాదం చేస్తున్న నాయకులు

అంతర్జాతీయ గోల్ఫ్ పోటీలు ప్రారంభం

వార్త మెయిన్‌లో..

ఎయులో తాపీ ధర్మారావు జయంతి వేడుకలు

వార్త 2లో..

రాష్ట్రంలో అరాచక పాలన

వార్త 2లో..

తెలుగు భాషాభివృద్ధికి త్వరలో వెబ్‌సైట్

ఎపి అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : త్వరలో తెలుగు భాషాభివృద్ధికి వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషా అభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి.విజయబాబు తెలిపారు. తెలుగు సాహిత్యానికి ఉత్తరాంధ్ర పుట్టినిల్లువంటిదని, ఇక్కడ నుంచి ఎంతో మంది కవులు, పండితులు, భాషాభిమానులు తెలుగు అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. బుధవారం ఉదయం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో కవులు, పండితులు భాషాభిమానులతో ఉత్తరాంధ్ర తెలుగు సాహిత్య సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. తెలుగు అధికార భాషకు ఇప్పటి వరకూ ఎటువంటి వెబ్‌సైటూ లేదని, దానిని రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. పత్రికా ప్రతినిధులు రాజకీయాలను అతీతంగా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న విజయబాబు

త్వరలో తిరుపతిలో ఆత్యాధ్మిక భాషోత్సవాలు, పల్నాడులో దళిత సాహిత్య ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కోర్టు తీర్పులు తెలుగులో ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాపీ ధర్మారావు, గురజాడ జయంతి మిగతా 2లో..

అడుగుపడని అనుసంధాన పనులు

- శంకుస్థాపనకే పరిమితమైన ఏలేరు-తాండవ
- ప్రారంభంకాని భూ సేకరణ
- వెంటాడుతున్న నిధుల సమస్య

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఏలేరు-తాండవ కాలువ అనుసంధాన పనులకు అడుగులుపడలేదు. భూ సేకరణతో కలిపి రూ.459.16 కోట్ల విలువైన ఈ పనులకు 2022 డిసెంబరులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించి రూ.470.05 కోట్లకు 2021 మార్చి 19న పరిపాలన ఆమోదం లభించింది. 18 నెలల కాల పరిమితిలో ఈ ప్రాజెక్టు పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్ ముందుకొచ్చాడు. ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే ఈ ఏడాది జనవరి నాటికి పూర్తిచేయాలని భావించారు. కానీ ఈ నాటికీ ఏ పనీ ముందుకు కదల్లేదు. పంప్‌హౌస్ పనుల డిజైన్ తయారుచేసే పని జరుగుతోంది. ఏలేరు-తాండవ రిజర్వాయర్ల అనుసంధాన పనులు పూర్తయితే తాండవ రిజర్వాయర్ కింద కాకినాడ, అనకాపల్లి జిల్లాలోని 51,465 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు ఏలేరు ఎడమ ప్రధాన కాలువ కింద కొత్తగా 5,600 ఎకరాలకు సాగునీటి సౌకర్యం లభించనుంది. అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, నాతవరం, కోటవురట్ల మండలాలు, కాకినాడ జిల్లాలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, మిగతా 2లో..



తాండవ-ఏలేరు కాలువ లింక్ ప్రాజెక్ట్ శంకుస్థాపనలో సిఎం జగన్మోహన్ రెడ్డి (ఫైల్‌ఫొటో)

మొదటి పేజీ తరువాయి..

అడుగుపడని అనుసంధాన పనులు

శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు, తుని మండలాలకు సాగునీటి సౌకర్యం కలగనుంది.

ఈ ప్రాజెక్టు పనుల్లో భాగంగా ఏలేరు ప్రధాన ఎడమ కాలువ 68 కిలోమీటర్లలో పూడికతీయడం, సిమెంట్ కాంక్రిట్ లైనింగ్ చేయడం సహా ఆరు లిఫ్ట్‌ల నిర్మాణ పనులు చేపట్టాల్సివుంది. అనకాపల్లి జిల్లాలో మూడు, కాకినాడ జిల్లాలో మూడు లిఫ్ట్‌లు ఏర్పాటు చేయడం ద్వారా పథకం నిర్దేశిత లక్ష్యాలకు తగినట్లు సాగునీటి సౌకర్యం లభిస్తుందని రైతులు ఎంతో ఆశపడ్డారు. కానీ ఇంతవరకూ పంప్‌హౌస్ పనులు మొదలుపెట్టడానికి అవసరమైన భూమిని కూడా సేకరించలేదు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో 27 ఎకరాలు, కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు, రౌతులపూడి, కోటనందూరు మండలాల్లో 13 ఎకరాలు అవసరమని నీటిపారుదల శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ఇంతవరకూ భూ సేకరణకు సంబంధించిన పనులేవీ ప్రారంభంకాలేదు. భూమి అప్పగించనందున పనులు ప్రారంభించలేకపోతున్నట్లు నీటిపారుదల శాఖాధికారులు చెబుతున్నారు. కాంట్రాక్టర్‌పై కూడా ఒత్తిడి తేలేని పరిస్థితి ఏర్పడింది. ప్రాథమికంగా అవసరమైన 40 ఎకరాల భూ సేకరణకు సరిపడా నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో భూ సేకరణ పనులు ముందుకు సాగడంలేదని తెలిసింది. పంప్‌హౌస్ పనులు మొదలుపెట్టాలన్నా కాంట్రాక్టర్‌కు భూమి అప్పగించాల్సివుంది. పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకొచ్చినా నిధుల సమస్యతో పనులు ఎక్కడవి అక్కడే వున్నాయి.

తెలుగు భాషాభివృద్ధికి త్వరలో వెబ్‌సైట్

కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గురజాడ నుంచి వంగపండు వరకూ అనేక మంది భాషాభిమానులు, కవులు, పండితులు తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. జానపద కథా సాహిత్యం గురించి సూచనలు, సలహాలు తీసుకుంటున్నామన్నారు. తెలుగు భాషకు సేవ చేస్తున్న వారిని సత్కరిస్తున్నామన్నారు. చిన్నయ్యసూరి విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేశామన్నారు.

ఎయులో తాపీ ధర్మారావు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు మాధ్యమాల దినోత్సవాన్ని పురస్కరించుకొని తాపీ ధర్మారావు జయంతి వేడుకలను ఎయులో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత తాపీ ధర్మారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశానికి తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు మాట్లాడారు. తాపీ ధర్మారావు జీవన ప్రస్థానాన్ని వివరించారు. విస్తృత పుస్తక పఠనంతో అభ్యుదయ దృక్పథంతో తాపీ ధర్మారావు హేతువాదిగా, నాస్తికుడిగా మారాడన్నారు. ఆయన గతాన్ని వర్తమానానికి, భవిష్యత్తుకు ఆలంబన చేసుకొని రచనలు చేసాడని గుర్తుచేశారు. స్వాతంత్ర్యోద్యమంలో అక్షరాలను అందించిన పత్రికా రంగంలో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టిన ఘనత తాపీ ధర్మారావుకే దక్కుతుందని కొనియాడారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ఆచార్య జి.యోహాన్ బాబు మాట్లాడుతూ తాపీ ధర్మారావు సత్యనిష్టగల వ్యక్తని అన్నారు. ఆయన అందరికీ దార్శనికుడు, మార్గదర్శకుడయ్యారన్నారు. కార్యక్రమంలో ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ డివి.సూర్యారావు, తెలుగు ఆచార్యులు డాక్టర్ ఎ.సీతారత్నం, డాక్టర్ ఎ.ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టెపోగు రత్నశేఖర్, డాక్టర్ పెండ్యాల లావణ్య, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, మరడాన సుబ్బారావు, అడపా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుముఖ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహాకవి గురజాడ వెంకట అప్పారావు 161వ జయంతిని పురస్కరించుకుని సాహితీ స్రవంతి ఆధ్వర్యాన లయన్స్ క్లబ్ సహకారంతో పలు విద్యాలయాలలో దేశభక్తి, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కంచరపాలెం ప్రాంతంలోగల ప్రభుత్వ మెకానికల్ ఇంజినీరింగ్ కళాశాలలో దేశభక్తి గీతాలు, ఉపన్యాస పోటీలు జరిగాయి. గవర్నమెంట్ ఐటిఐలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఫ్రాన్సిస్, పి.రామారావు, కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ కెవి.రమణ, ఐటిఐ ఆఫీసర్ జయలక్ష్మి, ఉమాదేవి, జ్యోతి, రామాంజనేయులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కార్మిక ఉపాధ్యాయులు పిల్ల అర్జునుడు, సాహితీవేత్తలు కెబిఎన్.మూర్తి, ఆంటోనీ, పి.ఉమ, వెంకట అప్పారావు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల అధ్యయన యాత్ర విజయవంతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి కార్పొరేటర్ల అధ్యయన యాత్ర ఈ నెల 10 నుంచి 17 వరకు జమ్ము, శ్రీనగర్, అమృత్‌సర్, కాత్రా ప్రాంతాల్లో విజయవంతంగా ముగిసిందని డిప్యూటీ మేయర్ శ్రీధర్ తెలిపారు. ఈ యాత్ర విశేషాలను తెలిపేందుకు బుధవారం సాయంత్రం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనగర్‌లో చేపడుతున్న ఘన వ్యర్థాల నిర్వహణ, పూడిక తొలగింపు, మెకానికల్ సాగ్రిగేషన్, కంపోస్టింగ్, లీచేట్ ట్రీట్మెంట్, అమృత్ పథకం కింద చేపట్టిన సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం, వివిధ ఉద్యానవనాల అభివృద్ధి, డ్రైనేజ్ వాటర్ ప్లాంట్ నిర్మాణం వంటి విషయాలు తెలుసుకున్నామన్నారు. సమావేశంలో వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఉక్కు రక్షణ యాత్ర ప్రారంభం



మాట్లాడుతున్న మాజీ వీసీ బాలమోహన్‌దాస్



మధురవాడలో మాట్లాడుతున్న లోకనాథం

(మొదటి పేజీ తరువాయి..)

స్టీల్‌ప్లాంట్ నిలిచిందని గుర్తుచేశారు. ఉక్కు రక్షణ బైకు యాత్ర ప్రభుత్వానికి ఓ హెచ్చరిక వంటిదన్నారు. రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణమూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర బైక్ యాత్ర రెండోదశ ఉద్యమం అని అభివర్ణించారు. గంగవరం అదానీ పరం అయ్యాక కార్మికులకు ఎన్ని కష్టాలు వచ్చాయో అందరికీ తెలుసునని, స్టీల్‌ప్లాంట్‌కు ఆ పరిస్థితి రాకుండా అడ్డుకోవాలని అన్నారు. సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రధాన పార్టీల ఎంపీలు ఢిల్లీలో ఎందుకు పోరాడడం లేదని ప్రశ్నించారు. సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు కొండయ్య మాట్లాడుతూ బైక్ యాత్రను చేపట్టిన సిపిఎంను అభినందించారు. సభలో సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దేవా, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాసరావు, బొట్టా ఈశ్వరమ్మ, డాక్టర్ బి.గంగారావు, బి.పద్మ, బి.జగన్, శ్రీనివాసరాజు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకులు రామస్వామి, వైటి.దాస్, కృష్ణంరాజు, ఎన్.రామారావు, సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవింద్, ఐఎన్‌టియుసి నాయకులు రామచంద్రరావు, ఉక్కు పోరాట నేతలు బి.పైడిరాజు, వరసాల శ్రీనివాసరావు, ప్రసాద్, స్వామి, చిరంజీవిరావు, మస్తానప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడిక్కడ సాదర స్వాగతం

పిఎం.పాలెం : కొమ్మాది కూడలి వద్దకు చేరుకున్న ఉక్కు రక్షణ బైకు యాత్రకు సాదర స్వాగతం లభించింది. సిపిఎం మధురవాడ జోన్ కమిటీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇక్కడ జరిగిన కార్యక్రమంలో యాత్రకు నాయకత్వం వహిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడారు. యాత్రకు స్వాగతం పలికిన వారిలో సిపిఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు, నాయకులు పి.రాజ్ కుమార్, బి.భారతి, డి.కొండమ్మ, కె.సుజాత, జి.చిన్నారావు, టి.రమేష్, కె.రాము ఉన్నారు.

ఆనందపురం : యాత్రకు బోయపాలెం కూడలిలో సిపిఎం నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, సిఐటియు నేతలు స్వాగతం పలికారు. ఆనందపురం కూడలిలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ప్లైవుడ్ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని జాతరకు సంఘీభావం తెలిపారు. సిపిఎం విశాఖ జిల్లా నాయకులు, గంభీరం సమైక్య అపార్ట్‌మెంట్ నాయకులు విఆర్.నాయుడు, కృష్ణమూర్తి, ద్రాక్షాయిని, సత్యం నాయుడు, లక్ష్మి, ఐద్వా నాయకులు కె.నాగరాణి, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు డి.రాము, ప్లైవుడ్ యూనియన్ నాయకులు డి.రమణ, రామారావు పాల్గొన్నారు.

తగరపువలస : స్థానికంగా వివిధ రంగాల కార్మికులు యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. వై జంక్షన్ నుంచి ప్రధాన రహదారి మీదుగా జంక్షన్‌కు బైకు ర్యాలీ చేరుకుంది. అనంతరం జరిగిన సభలో లోకనాథం, జగ్గునాయుడు మాట్లాడుతూ దేశ కార్మిక వర్గ పోరాట చరిత్రలో ఉక్కు పరిరక్షణ ఉద్యమం చారిత్రాత్మకంగా నిలుస్తుందన్నారు. ఆర్ఎస్ఎన్.మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో రవ్వ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన పాటలు స్థానికుల్లో చైతన్యం నింపాయి.

కళాకారులు ఎం.చంటి, ఈశ్వరరావు, లోకేష్, వెంకట్రావు, రవి, డేవిడ్, వినోద్ తదితరులు పాడిన పాటలు ఎంతగానో ఆలోచింపజేశాయి.

రాష్ట్రంలో అరాచక పాలన

కలెక్టరేట్ : రాష్ట్రంలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ విమర్శించారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో కూడా ఇంతటి అరాచకం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలీసు వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. రాష్ట్ర మంత్రులు తమ బాధ్యతలను మరిచి జగన్మోహన్‌రెడ్డి భజన చేస్తున్నారన్నారు. 2024 ఎన్నికలలో ఓటమి తప్పదనే విషయం స్పష్టంగా తెలియడంతో అక్రమంగా చంద్ర బాబుపై కేసులు పెట్టి అరెస్టు చేశారన్నారు. జైలులో పెట్టిన తర్వాత సాక్షాలు సేకరిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. మరోవైపు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎపి ఫైబర్, రింగ్‌రోడ్డు ఎలైన్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయంటూ మరికొన్ని కేసులను తవ్వే ప్రయత్నం చేస్తోందన్నారు. ఎవరు ఎన్ని కుతంత్రాలు పన్నినా రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన కూటమి విజయం సాధించి తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో పి.వసంతరావు, బోడేపూడి దొరబాబు, దువ్వి పరమేశ్వరరావు, కెఎస్.ప్రసాద్, అనసూరి మధుసూదన రావు, గండి మోహన్, పి.గురునాథరావు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భారత నాస్తిక సమాజం రాష్ట్ర కన్వీనర్ టి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ప్రస్తుతం చర్చలోకి వస్తున్న పీఠాధిపతులు, సాధువుల రాజ్యాంగ ముసాయిదాను వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ మేధావి, సామాజిక విప్లవకారుడు బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

IN THE COURT HON'BLE MVACT-Cum-HON'BLE XXVII ADDL CHIEF JUDGE CITY CIVIL COURT: AT : SECUNDERABAD.
O.P.No. 419 OF 2022

Between :
Ch.Sangamesh ...Petitioner
And
A.Kishore & others ...Respondents

To.
2. Karri Ramesh Varma S/o Kunchayya, Age: Major, Occ: owner of Car Br.No. AP-31-CC-8989, R/o. D.No.3-89, Street No.1, Old Dairy Farm, Adarsa Nagar, Vishakhapatnam, Andra Pradesh.

NOTICE

Please take notice that in the above matter the Petitioner had filed case against you (Respondent No.2) for compensation, and the same is posted for your appearance on 3-10-2023. You are advised to appear on **3-10-2023** at **10.30** a.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided ex party.
(BY THE ORDER OF THE COURT)

E.BALA KRISHNA,
V. SHANTHI
M.PRASHANTH
Advocates
H. No.5-12-186-/8, Mangapuram,
Counsel for Petitioner

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
E.P. 20/2022 in O.S. 2/2022

Between:
Marupilla Rajendra Prasad
. . . Plaintiff / D.Hr

And:
Smt. Bantupalli Padmavathi
. . . Defendant / J.Dr.

NOITCE

To
J.Dr / Defendant:
Smt. Bantupalli Padmavathi,
W/o. Late Trimurthulu,
D.No.16-143, LIG-II-53,
A.P.H.B.Colony, P.M.Palem,
Visakhapatnam-48.

Please take notice that the above E.P. which is filed by the D.Hr/ Plaintiff against you under Order 21 Rule 54, 64 to 66 CPC for attachment and sale of the E.P. schedule property stands posted to **20-11-2023** for your notice. If you have any objection you may attend either personally or through an advocate before the above said court at **10-30 A.M. on 20-11-2023** failing which the matter will be decided exparte in your absence.
(By Order of thc Court)

SURAPANEENI RAJA LAXMAN
Advocate
D.No. 6-70, Chandrampalem,
Madhurawada
Visakhapatnam-48
Cell : 9866481489

Visakhapatnam
Dt. 20-09-2023

గ్రామ పంచాయతీ కార్యాలయం - తాటితూరు

రేఖా నెం. 296/2023 — టెండరు ప్రకటన — తేదీ.15-09-2023

విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలం, తాటితూరు గ్రామపంచాయతీ ఏరియాలో 2023-24 ఆర్థిక సంవత్సరమునకు ఈ దిగువ వివరించిన పనుల కొరకు, సీల్డు టెండరు ఆహ్వానించడమైనది. టెండర్లు తేది: 23-09-2023 మధ్యాహ్నం 12.00 గంటల వరకు స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం 3.00 గంటలకు అప్పటికి హాజరగు టెండరుదారులు లేక వారి ఏజెంట్ల సమక్షంలో తెరువబడును. టెండరుదాఖలు చేయువారు విధిగా ధరావత్తు సొమ్ము చెల్లించి ఉండవలెను. ఖరారు కాబడిన టెండరుదారులు పంచాయతీ నిబంధనలు అనుసరించి 100/- రూపాయలు బాండు పేపరుపై అగ్రిమెంటు సమర్పించవలెను. టెండరు షరతులు మరియు టెండరు వేయు పనులు గూర్చి వివరములు ముందుగా ఈ కార్యాలయం పని చేయు వేళలయందు వచ్చి తెలుసుకొనలెను.

వ.నెం.	పని వివరములు	చెల్లించవలసిన ధరావత్తు మొత్తం
1.	గ్రామ పంచాయతీ ఏరియాలో పారిశుధ్య పనులు నిర్వహణకు నలుగురు, వాటర్ సప్లై పనుల నిర్వహణకు ఇద్దరు, వీధిదీపముల నిర్వహణకు ఇద్దరు, సిబ్బందితో నిర్వహించుటకు రేటు	రూ 2000/-

గమనిక : (1) పై పనుల యొక్క టెండర్లు శ్రీ జిల్లా పంచాయతీ అధికారి, విశాఖపట్నం వారి అనుమతి ఉత్తర్వులకు లోబడి ఖరారు చేయుట మరియు లేబరు కాంట్రాక్టరుకు చెల్లింపులు చేయుట జరుగును. **(2)** టెండర్లు ఏ కారణం చేతనైననూ రద్దు పరుచుటకు, వాయిదా వేయుటకు లేక మరలా నిర్వహించుటకు గ్రామపంచాయతీకి అధికారము కలదు.

సం/- జి.శంకర్ జగన్నాథ్
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, తాటితూరు,
భీమునిపట్నం మండలం

సం/- సిరిగిడి సంతోషి
సర్పంచ్,
గ్రామపంచాయతీ, తాటితూరు,
భీమునిపట్నం మండలం.

వాలంటీర్ల నియామకం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలో ఆరుగురు వాలంటీర్లను నియమించినట్లు పద్మనాభం ఎంపిపి రాంబాబు బుధవారం తెలిపారు. నేరెళ్లవలస పంచాయతీలో ఇద్దరు, బాందేవపురం, రెడ్డిపల్లి, తునివలస, రేవిడిలో ఒక్కొక్క వాలంటీర్‌ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాల పంపిణీలో ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్, మండల వైసిపి అధ్యక్షులు కె.లక్ష్మణరావు, నాయకులు ఈశ్వరరావు సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ రహదారిపై బోరవానిపాలెం కూడలి వద్ద బుధవారం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. నగరం నుంచి ఆనందపురం వైపు వెళ్తున్న లారీ జాతీయ రహదారిలో డంపింగ్ యార్డు మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడటంతో లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వారిని హాస్పిటల్ తరలించారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రించారు. కేసు నమోదు చేసినట్లు పిఎం.పాలెం. సిఐ వై.రామకృష్ణ తెలిపారు.

ఎఎస్ఆర్ నగర్‌లో గడపగడపకు...

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు పరిధి నరసింహనగర్ సచివాలయం, ఎఎస్ఆర్.నగర్ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఇంటింటికీ వెళ్ళి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ, పేద ప్రజలకు ఆర్థిక స్వాలంభన చేకూర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆళ్ళ శివ గణేష్, ఆదిరెడ్డి అప్పారావు, పి ప్రవీణ్‌వర్మ, కె.సత్యనారాయణ, కోడూరి సుశీల, భోగలింగ ఈశ్వరరావు, షేక్ బాబ్జి పాల్గొన్నారు.

24లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-ఆనందపురం : ఈ క్రాప్ నమోదును ఈ నెల 24వ తేదీలోపు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.అప్పలస్వామి సూచించారు. మండలంలోని గొట్టిపల్లి, కుసులవాడ రైతు భరోసా కేంద్రాలను ఆయన సందర్శించారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు రాజేశ్వరి, సీత ఈ క్రాప్ ఎంత వరకు నమోదు చేశారో పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంట పొలాలను అప్పలస్వామి పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. బోని గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఎడిఎ బి.విజయప్రసాద్ సందర్శించి ఈ క్రాప్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంటపొలాన్ని పరిశీలించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు అన్నానగర్, బాలాజీనగర్‌లో రూ.43 లక్షలతో నిర్మించనున్న వీధి రోడ్లు, కాలువలకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయం మేరకు విశాఖ నగరాన్ని సుందరీకరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాసరావు, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

ముడసర్లోవ పార్కు ఆధునికీకరణకు ప్రణాళికలు


ముడసర్లోవలో పలు సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ పార్కు ఆధునికీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ముడసర్లోవ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముడసర్లోవ పార్కును సందర్శకుల కోసం ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పార్కులో పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. మొక్కలకు రక్షణగా వేసిన గ్రిల్స్ పాడైనందున వాటిని మెకానికల్ విభాగపు అధికారులకు అప్పగించాలని డిడిహెచ్ దామోదరరావును ఆదేశించారు. రామకృష్ణాపురంలో ఓపెన్ డ్రైన్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీరు శ్యాంసన్ రాజును ఆదేశించారు. రామకృష్ణాపురం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని, ఏరోజు చెత్త ఆరోజు తరలించాలని ప్రజా ఆరోగ్యపు అధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో జెడ్సీ కనక మహాలక్ష్మి, కార్యనిర్వాహక ఇంజినీరు మత్స్యరాజు, ఎఎంఒహెచ్ డాక్టర్ కిషోర్, డిఇ వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఫాల్స్ ప్రివెన్షన్ అనుభవ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ ఫాల్స్ ప్రివెన్షన్ వారోత్సవాల్లో భాగంగా ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాలలోని జివిఎంఆర్ వరలక్ష్మి ప్రాంగణంలో వృద్ధుల కోసం ఫాల్స్ ప్రివెన్షన్ అనుభవ కేంద్రాన్ని అరబిందో ఫార్మా లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ కమలాకర్ విఠల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 60 ఏళ్ల పైబడిన వృద్ధులు ఇంటి వద్ద తూలి పడిపోవడం, దెబ్బలు తగలడం, కంటి చూపు మందగించడం తరచూ జరుగుతుంటాయని, ఇటువంటి వారికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించేందుకు ఈ కేంద్రాలు దోహదపడతాయన్నారు. ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పతంగే మాట్లాడుతూ, వృద్ధులు పట్టుకోవడానికి కడ్డీలు, రెయిలింగ్ ఏర్పాటు, స్నానాల గదిలో కుర్చీ ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారు పడిపోవడాన్ని నివారించవచ్చని తెలిపారు. ఇటువంటి సదుపాయాలు ఫాల్స్ ప్రివెన్షన్ అనుభవ కేంద్రంలో ఉంటాయన్నారు. అనంతరం వృద్ధులు పడిపోవడానికి కారణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

ఇంటర్న్‌షిప్‌తో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి -ములగాడ : ఇంటర్న్‌షిప్పులతో నైపుణ్యాలు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో బుధవారం డిగ్రీ నాలుగవ సెమిస్టర్ విద్యార్థినుల నైపుణ్య ఆధారిత స్వల్ప కాలిక ఇంటర్న్‌షిప్పుల మూల్యాంకన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఇంటర్న్‌షిప్‌ల వల్ల ప్రత్యక్షంగా విద్యార్థి జ్ఞానాన్ని సముపార్జిస్తాడని, ప్రత్యక్ష జ్ఞానం విషయ అవగాహనను పెంచుతుందని పేర్కొన్నారు. పెస్ట్ కంట్రోల్, డ్రోన్ టెక్నాలజీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, జావా, ఎక్సెల్ తదితర కంప్యూటర్ కోర్సులు ఈ ఇంటర్న్‌షిప్ కింద విద్యార్థినులు అభ్యసించారు. ప్రతి 20 మంది విద్యార్థినులకు ఒక అధ్యాపకురాలు మెంటార్‌గా వ్యవహరించి మార్గదర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు వై.అనసూయాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందిద్దాం : ఇఒ

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానం ఇఒగా బాధ్యతలు చేపట్టిన సింగాల శ్రీనివాసమూర్తి బుధవారం తన కార్యాలయంలో దేవస్థానంలో పనిచేస్తున్న విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందరూ సమిష్టి కృషితో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారి మన్ననలు పొందాలని చెప్పారు. ముఖ్యంగా పారిశుధ్యం, సెక్యూరిటీ సిబ్బంది విధానాలపై ఆరా తీశారు. ఆర్జిత సేవలు వివరాలు తెలియజేసే సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, తిరుపతి తరహాలో వాహనాలను టోల్‌గేట్ వద్ద చెకింగ్ చేసి వాహనదారులకు సూచనలు చేసే బోర్డును ఏర్పాటుచేయాలని సూచించారు. భైరవ స్వామి, వెంకటేశ్వర స్వామి, మాధవధార ఆలయాలు, పైడితల్లి అమ్మవారి ఆలయం విశిష్టతను తెలిపే సైన్ బోర్డు ఏర్పాటుచేయాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, ఇఇ శ్రీనివాసరాజు, ఎఇలు రమణమూర్తి, నరసింహారాజు, భ్రమరాంబ, సూపరింటెండెంట్లు పాలూరి నర్సింగరావు, విక్రం పాల్గొన్నారు

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి : ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో బుధవారం అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఇప్పటికే ప్రారంభించిన పనులను పూర్తిచేయాలని, ప్రతిపాదన దశలో ఉన్న పనులకు నిధులు ఏ మేరకు అవసరమో అంచనాలు రూపొందించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల తహశీల్దార్లు, ఎండిఒలు, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

న్యూ ఢిల్లీ సైనిక్ శిబిరానికి గీతం విద్యార్థిని

ప్రజాశక్తి -మధురవాడ : న్యూఢిల్లీలో ఎన్‌సిసి ప్రధాన కార్యాలయం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సైనిక్ శిబిరానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థిని హర్షిత ప్రగతి ఎంపికయ్యారని గీతం ఎన్‌సిసి అధికారి కల్నల్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్న హర్షిత కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో సైతం ప్రతిభ గల విద్యార్థినిగా 9.9 సిజిపి సాధించి, ఆరు ఎన్‌సిసి శిక్షణ శిబిరాలకు హాజరై ప్రతిభను చాటడంతో జాతీయ సైనిక్ శిబిరానికి ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థిని ఎంపిక పట్ల ఎన్‌సిసి అధికారి డాక్టర్ పరిమళ వేణు అభినందనలు తెలిపారు.

చిన్నారి పట్ల అసభ్య ప్రవర్తనపై జైలు శిక్ష

ప్రజాశక్తి-లీగల్ : నాలుగో తరగతి చదువుతున్న చిన్నారి పట్ల అసభ్య ప్రవర్తన చేశారనే అభియోగం రుజువైనందున 56 ఏళ్ల వ్యక్తికి చిన్నపిల్లల పట్ల లైంగిక వేధింపుల కేసుల విచారణ జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది ఐదేళ్ళ జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో చిన్నారి తరుపున వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన కేసు వివరాలు ఇలా ఉన్నాయి... గాజువాక సమీపంలోని వెంకటేశ్వరనగర్ కాలనీలో గుజ్జాల సూరయ్య (58) ఏలియాస్ రాజు అదే ప్రాంతానికి చెందిన నాలుగవ తరగతి చదువుతున్న చిన్నారిని 2022 ఏప్రిల్ 28వ తేదీన రాత్రి 7 గంటల ప్రాంతంలో రోడ్డు పక్కన పొదల్లోకి తీసుకెళ్లి అసభ్యకర ప్రవర్తన చేశాడు. దీనిపై చిన్నారి తల్లి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు నేరాభియోగ పత్రాన్ని కోర్టులో దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

'బలమైన ఆధారాలతోనే చంద్రబాబుకు రిమాండ్'

ప్రజాశక్తి-సీతమ్మధార : స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో రూ.371 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని బలమైన సాక్ష్యాధారాలు ఉన్నందునే చంద్రబాబుకు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించిందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ తెలిపారు. లలితానగర్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు తన ఎన్నికల అఫిడవిట్లో తొమ్మిది క్రిమినల్ కేసులు ఉన్నాయని పేర్కొన్నారని తెలిపారు. ఆ తొమ్మిది కేసులకు టిడిపి నేతలు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 17 కేసుల్లో స్టేలు తెచ్చుకొని నాయకుడిగా చలామణి అవుతున్న చంద్రబాబు బండారం స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ ద్వారా ప్రజలకు తెలిసిందని పేర్కొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ, శివాజీనగర్ -2 ప్రాంతానికి చెందిన రాయిపల్లి ఆనందరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను ఆయన కుటుంబ సభ్యులకు వార్డు వైసిపి అధ్యక్షులు కెల్ల సత్యనారాయణ బుధవారం అందజేశారు. మిగతా రూ.90 వేలు నామినీ బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు వెల్ఫేర్ సెక్రటరీ బ్రహ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పోలారావు, బేత దుర్గారావు, వెంకటరెడ్డి, పాండ్రంకి శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి -పద్మనాభం : జిల్లా స్థాయిలో ఈ నెల 15వ తేదీన తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన వికలాంగుల ఆటల పోటీల్లో పద్మనాభం మండలం నుంచి ప్రతిభ చూపిన ఎనిమిది మంది విద్యార్థులను బుధవారం అభినందించారు. రన్నింగ్, త్రోబాల్, షాట్‌పుట్, డిస్క్‌త్రో వంటి పోటీలు నిర్వహించగా మండలానికి చెందిన ఇద్దరు ప్రథమ స్థానంలోనూ, ఇద్దరు ద్వితీయ స్థానంలోనూ, నలుగురు తృతీయ స్థానంలోనూ నిలవడంతో వారిని జిల్లా విద్యాశాఖాధికారి అభినందించారు. మండల విద్యాశాఖాధికారి టి.రమణ ఆనందం వ్యక్తంచేశారు. విద్యార్థుల గెలుపునకు సహకరించిన రిసోర్స్ పర్సన్ హంస రాజ్‌కుమార్, ఎంశ్రీనివాసరావు, ఆర్.హైమావతిని కూడా అభినందించారు.


నవరాత్రి ఉత్సవాల్లో మేయర్

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న కార్యక్రమాలకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి హాజరయ్యారు. ఇందులో భాగంగా సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయాన్ని మేయర్ సందర్శించారు. వినాయకుని దర్శించుకున్నారు. స్థానిక వైసిపి కార్పొరేటర్ సారిపల్లి గోవిందు ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మేయర్‌తో సారిపల్లి గోవింద్ తదితరులు

స్టీల్‌ప్లాంట్‌తోనే గాజువాక అభివృద్ధి

- కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయాలని చూడటం దుర్మార్గం
- మోడీ సర్కారు వెనక్కు తగ్గాలి
- సిపిఎం ఉక్కు రక్షణ బైకు యాత్రలో మేమూ భాగస్వాములవుతాం
- 'ప్రజాశక్తి'తో పారిశ్రామిక ప్రాంతవాసులు



గాజువాక (ఫైల్)

ప్రజాశక్తి - గాజువాక : విశాఖ ఉక్కు కర్మాగారంతో గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రజానీకానిది విడదీయరాని బంధం. ఒకప్పుడు పల్లెను తలపించేలా ఉన్న గాజువాక నేడు రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన ప్రాంతంగా నిలిచిందంటే దానికి కారణం విశాఖ ఉక్కు కర్మాగారమే. అందుకే మోడీ సర్కారు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై తన నిర్ణయాన్ని ప్రకటించగానే గాజువాక భగ్గుమంది. ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ఇక్కడి ప్రజానీకం, కార్మికవర్గం రెండేళ్లుగా పోరాడుతూనే ఉన్నారు. వారి ఉద్యమానికి ఎల్లప్పుడూ మద్దతునిస్తున్న సిపిఎం తాజాగా ఉక్కు రక్షణ బైకు యాత్ర పేరిట క్షేత్రస్థాయి ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఆ ప్రయత్నాన్ని గాజువాక పారిశ్రామిక ప్రాంత వాసులు స్వాగతిస్తున్నారు. తామూ ఈ యాత్రలో పాల్గొంటామని చెబుతున్నారు.

వాస్తవానికి విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కాకముందు గాజువాక ఒక చిన్న పల్లెగా ఉండేది. అలాంటి చిన్న గ్రామం స్టీల్‌ప్లాంట్ నిర్మాణం తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. ఒకప్పుడు పెందుర్తి నియోజకవర్గంలో ఉండే గాజువాక 2009వ సంవత్సరంలో ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడింది. రాష్ట్రంలోనే గాజువాక నియోజకవర్గం తలసరి ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉండడానికి స్టీల్‌ప్లాంట్ పరిశ్రమే ప్రధాన కారణం. స్టీల్‌ప్లాంట్ వల్ల గాజువాక పారిశ్రామికంగా, కమర్షియల్‌గా అభివృద్ధి చెందింది. ఐమాక్స్ థియేటర్, బంగారు, వస్త్ర వ్యాపార దుకాణాలు గాజువాకలో ఏర్పాటయ్యాయి. ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్రంలో అన్ని జిల్లాల ప్రజలు ప్రత్యక్షంగా పరోక్షంగా ఏదో ఒక పని చేసుకుని గాజువాక పరిసరాల్లోనే నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ముళ్ళపొదల మధ్య చిన్న గ్రామంగా ఉన్న గాజువాక అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందింది.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అనుబంధంగా గాజువాక ఆటోనగర్ ఏర్పాటైంది. గాజువాక ఆటోనగర్‌లో 900 పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో 500 పైచిలుకు స్టీల్‌ప్లాంట్‌కు అనుబంధంగానే నడుస్తున్నాయి. సుమారుగా 10,000 మంది కార్మికులు గాజువాక ఆటోనగర్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. పెదగంట్యాడ ఆటోనగర్‌లో మరో రెండు వేల మంది కార్మికులు స్టీల్‌ప్లాంట్ అనుబంధంగా ఉన్న పరిశ్రమల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరిగిన తర్వాతనే ఈ ఆటోనగర్‌లో పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగడం వల్ల ఈ అభివృద్ధి సాధ్యమైంది. అదే ప్రైవేట్ పరం అయితే ఈ స్థాయిలో అభివృద్ధి జరగదు. దీనికి ఉదాహరణగా జింక్ పరిశ్రమ ప్రభుత్వ రంగంలో ఉన్నప్పుడు వేలాదిమంది కార్మికులు దానిపై ఆధారపడి జీవించేవారు. జింక్ పరిశ్రమ ప్రైవేటుపరం అయ్యాక అది మూతపడి, కార్మికులు రోడ్డున పడ్డారు. నేటికీ ఆ పరిశ్రమలో పనిచేసిన కార్మికులకు పిఎఫ్, ఇతర లావాదేవీలు చెల్లించలేదు. అందుకే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగాలని గాజువాక ప్రజలు ఆశిస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ఏకైక పెద్ద పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్. ఇది ప్రైవేటు కాకూడదని సిపిఎం చేస్తున్న పోరాటానికి విశేష మద్దతు లభిస్తోంది. మీరు చేస్తున్న పోరాటానికి మేము సైతం అన్నట్లుగా అన్ని వ్యాపార సంఘాలు ఇదివరకే మద్దతు తెలిపాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని గాజువాక ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి



విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే ఉండడం వల్లనే గాజువాక అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించింది. బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీలకు అమ్మాలనే ప్రయివేటీకరణ కుట్రకు తెరతీసింది. బిజెపి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆందోళన చేస్తోంది. భవిష్యత్తులో కూడా పోరాటం మరింత ఉధృతం చేస్తుంది.

ఎం.రాంబాబు
సిపిఎం జోన్ కార్యదర్శి

అడవిలా ఉండేది



విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి. నేను గాజువాకలో పుట్టి పెరిగాను. ఒకప్పటి గాజువాకతో పోల్చి చూస్తే ప్రస్తుతం అనేక రెట్లు అభివృద్ధి చెందింది. కొత్త గాజువాక నుంచి పాత గాజువాక రావాలంటే దట్టమైన అడవిలా ఉండేది. ప్రస్తుతం వ్యాపారమాలగా అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధికి విశాఖ స్టీల్‌ప్లాంటే కారణం. సిపిఎం చేస్తున్న పోరాటం చాలా మంచిది.

కృష్ణ,
ఇందిరాకాలనీ

ఉపాధి కోసం వచ్చాను



పార్వతీపురం నుంచి ఉపాధి కోసం గాజువాక వలస వచ్చాను. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టర్ లేబర్‌గా చేరి, తర్వాత సొంతంగా వ్యాపారం చేసుకుని కుటుంబంతో హాయిగా జీవిస్తున్నాం. నాకు జీవనం ఇచ్చింది విశాఖ స్టీల్ ప్లాంట్.

సత్యం,
స్వతంత్రనగర్

స్టీల్‌ప్లాంట్ ఆధారం



తాత, తండ్రి నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి జీవిస్తున్నాం. వ్యాపారపరంగా అభివృద్ధి చెందడానికి విశాఖ స్టీల్‌ప్లాంటే ప్రధాన కారణం. ఆ కార్మికుల లేకపోతే గాజువాకలో వ్యాపారమే ఉండదు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కోరుకుంటున్నాను.

సురేష్
వ్యాపారి, నడుపూరు

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -గోపాలపట్నం : జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. గోపాలపట్నం మండలం, శాంతినగర్ సచివాలయం కమ్యూనిటీ హాల్‌లో మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గోపాలపట్నం మండల పరిధిలో ఉన్న గ్రామ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా ప్రతి సోమవారం జిల్లా ప్రధాన కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో మండల స్థాయిలో నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. దీనిలో భాగంగా ఈ నెల 8వ తేదీ నుండి అక్టోబర్ 13వ తేదీ వరకు బుధ, శుక్రవారాల్లో మండల కేంద్రాలలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జిల్లాలోని ప్రతి మండలంలోనూ ఈ కార్యక్రమం ఉంటుందని వివరించారు. అధికారులందరూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై పూర్తి శ్రద్ధతో పరిశీలించి సరైన సమాధానం నిర్దేశించిన సమయంలోగా ఇవ్వాలని ఆదేశించారు. గోపాలపట్నంలో వచ్చిన అర్జీలలో ప్రధానంగా రెవెన్యూ, జివిఎంసి, హౌసింగ్, ఇతర శాఖలకు సంబంధించి 33 విజ్ఞప్తులు అందాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్, ఎపిఎంఎస్ఎండిసి ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కో ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పోలీస్ అధికారులు, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఎంవిఆర్‌లో యోగా శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

ఎంవిఆర్‌లో యోగా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఉక్కునగరం : గాజువాకలోని ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో యోగ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆంధ్ర యూనివర్సిటీ సౌజన్యంతో అనుబంధ కేంద్రంగా దీనిని ప్రారంభించినట్లు కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు తెలిపారు. ముఖ్యఅతిథిగా యోగ విలేజ్ డైరెక్టర్ భాను కుమార్ హాజరై మాట్లాడారు. పాశ్చాత్య సంస్కృతి కారణంగా అనేక రోగాలను కొని తెచ్చుకుంటున్నారని తెలిపారు. అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న వారు యోగా ద్వారా వాటిని నివారించుకోవచ్చని పేర్కొన్నారు. యోగ టీచర్ నరేంద్ర విద్యార్థులకు ప్రాథమిక యోగ సూత్రాలను వివరించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ఎస్‌వి.కృష్ణ, ఈశ్వర్‌రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-ఉక్కునగరం : కణితి ప్రాథమిక హైస్కూల్‌లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను బుధవారం ప్రారంభించారు. డిఇఒ ఎల్.చంద్రకళ, భారత జాతీయ క్రికెటర్ కెఎస్.భరత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ, ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఆతిథ్యమిస్తున్న కణితి హైస్కూల్ సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. క్రీడల వల్ల పిల్లకు టీం వర్క్, నాయకత్వ లక్షణాలతో పాటు ఒత్తిడిని తట్టుకొనే శక్తి అలవడతాయని పేర్కొన్నారు. క్రికెటర్ భరత్ మాట్లాడుతూ, గెలుపు ఓటములు కంటే ఎంత నిబద్ధతతో ఆడామన్నదే ముఖ్యమని చెప్పారు. జీవితంలో ఒత్తిళ్లను ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 87వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, చిత్రాడ రమణ, జెర్రిపోతుల ఈశ్వరావు, దుగ్గపు దానప్పలు, ముద్దపు దామోదర్, బోండా గోవిందరాజులు, ప్రధానోపాధ్యాయులు సూర్య ప్రకాష్, పీడీ మన్నాజీ, నారాయణ పాల్గొన్నారు.

వైసిపి నగర ఉపాధ్యక్షునిగా దామా

ప్రజాశక్తి-ఉక్కునగరం : వైసిపి విశాఖ సిటీ వైస్ ప్రెసిడెంట్‌గా 86వ వార్డు అధ్యక్షుడు దామా సుబ్బారావు పార్టీ జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దామా సుబ్బారావు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికలకు పార్టీని మరింత బలపరచనున్నట్లు తెలిపారు.

పద్మనాభం తహశీల్దారుగా వేణుగోపాల్

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం తహశీల్దార్‌గా కె.వేణుగోపాల్‌ను నియమిస్తూ జిల్లా అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పద్మనాభం తహశీల్దార్‌గా ఇప్పటివరకు పనిచేసిన తోట శ్రీవల్లిని గాజువాకకు బదిలీ చేశారు. కె.వేణుగోపాల్ ఇప్పటివరకు భీమిలి తహశీల్దార్‌గా పనిచేశారు. తహశీల్దార్ శ్రీవల్లికి బదిలీ అయినట్లు తెలుసుకొని రైతులు నిరాశ చెందారు. మంచిగా పనిచేసిన వారిని ఇక్కడి నాయకులు ఉండనివ్వరని చర్చించుకుంటున్నారు.

మహానటుడు అక్కినేని

ప్రజాశక్తి -గోపాలపట్నం : భారతీయ చలనచిత్ర రంగంలో మహా నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని కళా సేవాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు అన్నారు. గోపాలపట్నం కళాసేవా పీఠం ఆధ్వర్యాన అక్కినేని శత జయంతిని నిర్వహించారు. ముందుగా అక్కినేని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

సివిల్ సర్వెంట్‌లు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యాంగ పరిధిలో ఎన్ని చట్టాలు చేసినప్పటికీ వాటిని సివిల్ సర్వెంట్‌లు బాధ్యతగా అమలు చేయకపోతే ప్రయోజనం ఉండదని మాజీ విసి, యుపిఎస్‌సి మాజీ ఛైర్మన్ ఆచార్య కెఎస్.చలం అభిప్రాయపడ్డారు. వైజాగ్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యాన పబ్లిక్ లైబ్రరీలో బుధవారం 'చట్టం- ప్రజా సేవకులు- జీవన విధానం' అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ కేబినెట్ ఆమోదించిన తీర్మానాలను సక్రమంగా అమలు చేయాల్సింది సివిల్ సర్వెంట్ లేనన్నారు. చేసిన చట్టాలకు లోబడి రూల్స్ అమలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సివిల్ సర్వెంట్స్ బాధితులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో లీగల్ లిటరసీ చాలా తక్కువగా ఉందన్నారు. చట్టాల పట్ల ప్రజల్లో అవగాహన ఉండటం లేదని తెలిపారు. దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ, చట్టాలు రాజ్యాంగబద్ధంగా అమలు చేయకపోతే ప్రజాస్వామ్యం కుప్పకూలుతుందన్నారు. ప్రజాస్వామ్య దేశాలలో న్యాయ వ్యవస్థకు అధిక ప్రాధాన్యత ఉందన్నారు. అవినీతిని నిర్మూలిస్తేనే వ్యవస్థ బాగుపడుతుందని తెలిపారు. లా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, న్యాయవ్యవస్థలో సరైన వసతులు, యంత్రాంగం లేకపోవడం వల్ల తీర్పులు ఆలస్యం అవుతున్నాయన్నారు. చేసిన అవినీతిని రూల్ ఆఫ్ లా ప్రకారం రుజువు చేయడం కష్టమన్నారు. సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ మాట్లాడుతూ, ఉన్నత పదవుల్లో ఉన్నవారికి రూల్ ఆఫ్ లా సరిగా అమలు జరగడంలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ గుండుపల్లి సుబ్బారావు, జై ఉత్తరాంధ్ర ఫోరం అధ్యక్షుడు జార్జి బంగారి, గిరిజన ఉపాధ్యాయుల సంఘం సభ్యులు ఎం.జాన్, వైజాగ్ ఇంటలెక్చువల్ ఫోరం సభ్యులు వేమన తదితరులు ప్రసంగించారు.

'330 ఎ'కి సవరణ చేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యసభ, విధాన సభలలో ఎస్సీ, ఎస్టీ మహిళా రిజర్వేషన్ వర్తించేలా ఆర్టికల్ 330 ఎ కి సవరణ చేయాలని విదసం ఐక్యవేదిక సభ్యులు డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. 128వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో ఆర్టికల్ 330 ఎ లో ఉన్న హౌస్ ఆఫ్ ద పీపుల్ స్థానంలో హౌస్ ఆఫ్ ద లెజిస్లేటర్స్ అని సవరణ చేస్తే అన్ని సభల సభ్యులకు రిజర్వేషన్లు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఈ సవరణ ద్వారానే ఒబిసిలకు కూడా చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని, అన్ని రిజర్వేషన్లలోనూ 50 శాతం సీలింగ్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



చోడవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు



కార్మికులతో మాట్లాడుతున్న సిపిఎం నేత ఆర్.రాము

ప్రజాశక్తి- చోడవరం

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం చేపట్టిన ఉత్తరాంధ్ర బైక్ యాత్రను జయప్రదం చేయాలని ముద్రించిన వాల్ పోస్టర్‌ను బుధవారం చోడవరం సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, వివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలు, 16వేల మంది రైతులు, 22 వేల ఎకరాల భూత్యాగంతో తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న, లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నరేంద్రమోడీ ప్రభుత్వం అమ్మాలని చూడటం దుర్మార్గమన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.వరలక్ష్మి, దేముల్లు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఉక్కు పరిరక్షణకు చేపట్టిన బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఆర్ రాము పిలుపునిచ్చారు. మండలంలోని వెదురువాడ, జి ధర్మవరం, లంక ధర్మవరం గ్రామాల్లో బుధవారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లో చేపట్టిన బైక్ యాత్ర 27వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు అచ్చుతాపురం చేరుకుంటుందని, దీనిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపూజీ, కొండబాబు, బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అమరావతి పార్కులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

గాజువాక : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిపిఎం చేపట్టిన ఉక్కు రక్షణ బైక్ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను గాజువాక అమరావతి పార్కులో బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.రాంబాబు, ఎన్.రామారావు, కె.సీతామహాలక్ష్మి, బి.గురప్ప ఉన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

ఆటల పోటీల్లో గాయత్రి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -కశింకోట

మండలంలోని తాళ్లపాలెం గాయత్రి ప్రైమరీ హైస్కూల్ విద్యార్థులు ఈనెల 15 నుండి 19 వరకు కశింకోట బాలికల హైస్కూల్‌లో జరిగిన మండల స్థాయి ఆటల పోటీలు ప్రతిభ చూపించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన 15 మంది విద్యార్థులను బుధవారం పాఠశాలలో అభినందించారు. మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఖోఖో, టెన్నిస్, బాడ్మింటన్ పోటీల్లో 15 మంది విద్యార్థులు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బి కుమార్, ప్రిన్సిపాల్ వై నగేష్, వ్యాయామ ఉపాధ్యాయుల రాము, యాజమాన్యం సభ్యులు ఐ అప్పారావు పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ వద్ద ఎపిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - యలమంచిలి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ఈ నెల 30న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, ఇందులో ఎపిటిఎఫ్ సభ్యులంతా పాల్గొని జయప్రదం చేయాలని సంఘం యలమంచిలి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేడ సత్యనారాయణ, ఎం.సత్యనారాయణలు కోరారు. బుధవారం మండలంలో గల అన్ని హైస్కూళ్లలోని ఫెడరేషన్ సభ్యుల్ని కలిసి ధర్నా కార్యక్రమం గురించి తెలియజేశారు. సిపిఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని, 3, 4 ,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసే ప్రక్రియను ఆపాలని, జిఒఎంఎస్ 117 తక్షణమే రద్దు చేయాలన్న డిమాండ్లతో ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బి.లక్ష్మణరావు, జి.సర్వేశ్వరరావు, కె.వీరభద్రరావు, ఎ.చంద్రశేఖర్, వై.సత్యారావు, ఎం.పాపారావు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి- సబ్బవరం

వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం వారి సౌజన్యంతో విశాఖపట్నం సూపర్ స్పెషాలిటీ పశు వైద్యశాల ఆధ్వర్యంలో మండలంలోని అంతకాపల్లి గ్రామంలో చింత కల్లల వద్ద ఉచిత పశు గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరం, రైతులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక ఎంపీపీ బోకం సూర్య కుమారి రాము నాయుడు, వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం బోర్డు మెంబర్ వాసుపల్లి జానకిరామ్, సర్పంచ్ సబ్బవరపు నారాయణ మూర్తి ప్రారంభించారు. ఈ శిబిరంలో 45 ఎదకు రాని పశువులకు, 56 గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 24 చూడి పరీక్షలు, 3 శస్త్ర చికిత్సలు, అనారోగ్యంతో ఉన్న 44 పశువులకు మొత్తం కలిపి 162 పశువులకు చికిత్సలు అందించినట్లు అంతకాపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ జి.అరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సూపర్ స్పెషాలిటీ పశు వైద్య శాల ఇన్‌ఛార్జి ఉపసంచాలకులు డాక్టర్ శ్రీకళ, వెటర్నరీ సర్జరీ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ రవి కుమార్, వెటర్నరీ గైనకాలజీ సహాయ ఆచార్యులు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ తేజ, విశాఖపట్నం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ ఎన్.కరుణాకరరావు, విశాఖపట్నం లేబొరేటరీ ఉప సంచాలకులు డాక్టర్ మోహిని కుమారి, సహాయ సంచాలకులు డాక్టర్ ఉషా కుమారి, డాక్టర్ చిట్టి నాయుడు, పశు వైద్యులు స్వర్ణలత, సౌజన్య, పూర్ణిమ, అనుపమ, పుష్ప, హరి ప్రియ, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, వైసిపి నాయకులు కోటాన రాము, వైస్ సర్పంచ్ గొర్లె అప్పారావు, వంగలి ఎంపీటీసీ గవర తులసి రాజు పాల్గొన్నారు.



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి సూర్యకుమారి



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన 'స్వచ్ఛతాహి సేవ' ప్రారంభం

ప్రజాశక్తి - యలమంచిలి

స్థానిక గురజాడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో బుధవారం 'స్వచ్ఛతాహి సేవ' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రోగ్రాం ఆఫీసర్ చిట్టిబాబు తెలిపారు. కేంద్రం ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం అక్టోబరు 2న గాంధీ జయంతి వరకూ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పౌరుడు రోజులో కనీసం 2 గంటలు పరిసరాల పరిశుభ్రత పనిలో పాల్గొనేట్లు చేయాలన్నారు. కాలేజీలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లంతా కళాశాల ప్రాంగణాన్ని, క్లాసు రూముల్ని పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్, రేఖా రామారావు పాల్గొన్నారు.

17న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ

ప్రజాశక్తి - యలమంచిలి

ఈ నెల 22 నాటికి పోలింగ్ కేంద్రాల పూర్తి వివరాలు, అందులోని ఓటర్ల సంఖ్యతో కూడిన నివేదిక అన్ని జిల్లా కేంద్రాలకు అందజేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన నేపథ్యంలో ఎన్నికల విభాగం పూర్తిగా ఆ పనిలో నిమగ్నమైనట్లు యలమంచిలి రెవెన్యూ విభాగం సీనియర్ సీనియర్ అసిస్టెంట్ నానాజీ బుధవారం తెలిపారు. మార్పులు చేర్పులతో రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితా అక్టోబరు 17న ప్రచురించాల్సి ఉందని పేర్కొన్నారు. రానున్న జనవరి 5వ తేదీ నాటికి తుది ఓటర్ల జాబితా ప్రకటించాల్సి ఉందన్నారు. పట్టణంలోని తులసీనగర్‌లో ప్రాథమిక పాఠశాల కూల్చివేత కారణంగా 41, 42, 43 పోలింగ్ కేంద్రాలను పక్కనే ఉన్న బాలికల హైస్కూలుకు మార్పు ప్రతిపాదన చేశామన్నారు. పట్టణ ప్రాంతంలో 1500, గ్రామీణ ప్రాంతంలో 1200 ఓటర్లు మించి ఉన్న పోలింగ్ కేంద్రాలు ఉంటే విభజించేందుకు ప్రతిపాదనలు పంపాలని నానాజీ సూచించారు. బిఎల్ఒలు నూతన ఓటరు దరఖాస్తుతో పాటు తప్పుల సవరణ పత్రాలు కూడా స్వీకరించాలని ఆదేశించారన్నారు. 18 ఏళ్ల నిండిన యువతకు ఓటు హక్కు కల్పించే విధంగా విద్యా సంస్థల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం

రైతులు తమ పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని అనకాపల్లి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు తెలిపారు. మండలంలోని నారపాడు, అసకపల్లి, సబ్బవరం గ్రామాలలో పంటల నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిఫైడ్ పంట అయినటువంటి వరి పంటను విధిగా అందరు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద పంట నమోదును చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు నష్టం వాటిల్లితే నష్టపరిహారం, ధాన్యం కొనుగోలు, పంట రుణాలు వంటి వాటికి ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు. మండలంలోని 7వేల ఎకరాలకుగాను 4500 ఎకరాల పంటలకు ఇప్పటివరకు పంట నమోదు చేసినట్లు చెప్పారు. మిగిలిన పంటను కూడా త్వరితగతిన ఈ-క్రాప్ నమోదు చేయాలని ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు హరీష్, అలేఖ్య, జానకి తదితరులు పాల్గొన్నారు.



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న రామారావు

కెనాల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



జెడ్‌పిటిసికి సమస్యలను వివరిస్తున్న కెనాల్ కార్మికులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

రైవాడ రిజర్వాయర్ నుంచి జివిఎంసికి నీటి సరఫరా చేస్తున్న రైవాడ కెనాల్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక జెడ్పిటిసి ఈర్లె అనురాధ హామీ ఇచ్చారు. దేవరాపల్లి నుండి కె.కోటపాడు మండలం మీదుగా విశాఖపట్నం జీవీఎంసీకి సరఫరా అవుతున్న రైవాడ ఓపెన్ కెనాల్‌పై ఎన్నో ఏళ్లగా పని చేస్తున్న 136 మంది కార్మికుల సమస్యలపై అనురాధ ఆధ్వర్యాన కార్మికులు జివిఎంసి మేయర్ గొలగాని హరివెంకటకుమారికి విన్నవించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ సుమారు 60 కిలోమీటర్ల పొడవున్న ఈ కెనాల్‌లో ప్రతిరోజూ ఈ కార్మికులు నాచు తొలగిస్తున్నారని, వీరికి నెలకు రూ.15వేలు వేతనం ఇస్తున్నారని తెలిపారు. ఇకపై రూ.18,500కు పెంచాలని కోరారు. ప్రతిరోజు నీటిలో దిగి నాచు తొలగిస్తుండటంతో వీరికి వివిధ రకాల చర్మ వ్యాధులు వస్తున్నాయని, వెంటనే వారికి హెల్త్ అలవెన్స్ అందజేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో కార్మికుల సమస్యలపై కౌన్సిల్లో చర్చించి న్యాయం చేస్తానని జెడ్పిటిసి అనురాధకు, కార్మికులకు మేయర్ హరి వెంకట కుమారి హామీ ఇచ్చారు.

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు గురువారం ప్రారంభమౌతాయని ఎస్‌జిఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ వై.రమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆటల పోటీల ప్రారంభోత్సవానికి విశిష్ట అతిథిగా ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు, ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రమాకుమారి, ఎంపిపి బోదెపు గోవింద, పిఎసి చైర్‌పర్సన్ జె.చంద్రకళ హాజరవుతారని ఆర్గనైజింగ్ కార్యదర్శి సిహెచ్.వెంకటరావు తెలిపారు.

పిహెచ్‌సి అదనపు గదుల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

తుమ్మపాల, తగరంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అదనపు గదులు నిర్మాణ పనులను ఎంపిపి, హాస్పిటల్ కమిటీ ఛైర్మన్ గొర్లి సూరిబాబు, ఏపీ ఇన్లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ వైస్ ఛైర్పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి బుధవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ హెల్త్ అండ్ మెడికల్ నిధుల నుండి ఒక్కొక్క ఆరోగ్య కేంద్రానికి రూ.9.83 లక్షలు చొప్పున మొత్తం రూ.19.66 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తట్ట పెంటయ్య నాయుడు, యాదగిరి అప్పారావు, వైస్ ఎంపీపీలు విల్లూరి కుమారి చంద్రశేఖర్, అయితా ఆనంద రాము, పన్నీరు చంటి వెంకటలక్ష్మి, పంచదార్ల కన్నారావు, వడ్డాది భారతి అశోక్, దంతులూరు కళ్యాణ్ చక్రవర్తి, కనుబుడ్డి శంకరరావు, ఆర్టీసీ సత్యనారాయణ, పిలా బుజ్జి, శ్రీను, పడాల గణపతి, వెంకుపాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, డాక్టర్లు షాహిన్ బేగం, పావని, తదితరులు పాల్గొన్నారు.



పనుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సూరిబాబు, దిలీప్‌కుమార్


పాస్ పుస్తకాలు అందజేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి తదితరులు

పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని సూదివలస గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు - భూ రక్ష కార్యక్రమంలో 300 మంది రైతులకు స్థానిక జెడ్పిటిసి సభ్యురాలు ఈర్లే అనురాధ చేతుల మీదుగా పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలపై రైతులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యేవారని, వీటన్నింటికీ జగన్ ప్రభుత్వం చెక్ పెట్టిందని తెలిపారు. దేశంలో ఎక్కడా జరగలేని విధంగా భూ సర్వే నిర్వహించి పాస్ పుస్తకాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, తహశీల్దార్ రమేష్ బాబు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : భూ సమగ్ర సర్వే ప్రకారం నమోదు చేసిన పాస్ పుస్తకాలను మండలంలోని ఉప్పవరం గ్రామ సచివాలయంలో బుధవారం ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లవరం గ్రామ సర్పంచ్ పి వాసురాజు, ఉప్పవరం గ్రామ ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు, వైసిపి నాయకులు చిన్ని శ్రీనివాసరావు, రావి శోభన్ బాబు, నరేంద్రపురం, ఉప్పవరం, మల్లవరం గ్రామ వాలంటీర్లు సచివాలయ సిబ్బంది, గ్రామస్తుల తదితరులు పాల్గొన్నారు.


మందపాటి జానికీరామరాజును సత్కరిస్తున్న దృశ్యం

మందపాటికి సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షులుగా పునర్నియామకమైన మందపాటి జానకీ రామరాజును బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుంకర మెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఛైర్మన్ కెవిఎం.నాయుడు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, ప్రముఖ వైద్యులు డాక్టర్ బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, ధర్మకర్తలు తాడి కోటేశ్వరరావు, మారిశెట్టి శ్రీను, విజ్జపు వాసు, పెంటకోట అప్పలనాయుడు పాల్గొన్నారు.

గణేష్‌కు రూ.10 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట మండలం చింతలపాలెం గ్రామంలో పసరమారమ్మ తల్లి గుడి వద్ద ఈ నెల 18న కారు ఢీకొని గాయపడి పులిమంతుల గణేష్‌కు తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి, సోమవరం గ్రామ మాజీ సర్పంచ్ గొంతిని శ్రీనివాసరావు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఉష ప్రేమ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గణేష్‌ను బుధవారం గొంతిని శ్రీనివాసరావు పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఆర్థిక సహాయం అందించారు. గణేష్ తొందరగా కోలుకొని ఇంటికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి ఉగ్గిన రమణ మూర్తి, టిడిపి అచ్చెర్ల గ్రామ అధ్యక్షులు నైయినంశెట్టి రమణారావు, తాళ్ళపాలెం గ్రామ అధ్యక్షులు వుల్లింగల రమేష్, మాజీ సర్పంచ్ కర్రి దుర్గునాయుడు, జెర్రిపోతుల నూకునాయుడు పాల్గొన్నారు.


గణేష్‌ను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

టన్ను చెరుకుకు రూ.3,500 చెల్లించాలి


రైతులతో మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్‌ఎన్.రాజు

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతులకు టన్నుకు రూ.3,500 చెల్లించాలని జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్ రాజు డిమాండ్ చేశారు. చోడవరం సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని రోలుగుంట, జె.నాయుడుపాలెం, తట్టబంద, రావికమతం, చినపాచిల, వడ్డాది, బుచ్చయ్యపేట, పిఎస్ పేట తదితర కాటాలు వద్ద రైతులతో బుధవారం జనసేన ఆధ్వర్యాన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రైతులను ఎంతో ఆదుకుంటున్నామని చెబుతున్న వైసిపి ప్రభుత్వం చెరుకు రైతులకు మద్దతు ధర ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. చెరుకు ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు వ్యవసాయానికి దూరమై పరిశ్రమల్లో కూలీలుగా మారారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం సుగర్ ఫ్యాక్టరీ ఇస్తున్న మద్దతు ధర రూ.2800 ఏమాత్రం సరిపోవడం లేదని, సుగర్ ఫ్యాక్టరీ నుండి ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై అందించడం లేదని తెలిపారు. పేమెంట్లు కూడా దఫా దఫాలుగా ఇవ్వడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బలిజ మహారాజు, మైచర్ల నాయుడు, డిఎస్ నాయుడు, గూనూరు మూలునాయుడు, గూనూరు సూర్యనారాయణ, పరవాడ దొరబాబు, నర్సింగరావు, సోమిరెడ్డి శివ శంకర్, పిల్లా అప్పలనాయుడు, భూషణం , గుండు గణేష్, రామ్మూర్తి, రమేష్, దొండా సాయి, సతీష్, శంకర్, ఉదయ్ పాల్గొన్నారు.


భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్‌పిటిసి తదితరులు

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల శ్మశానవాటికలో రూ.5 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం జెడ్‌పిటిసి లాలం రాంబాబు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల శాఖ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, నాయకులు కోన లచ్చన్న నాయుడు, కే శివ, బి ప్రకాష్, కట్టుమూరి శ్రీను, ఏ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

ప్రతిభ చూపిన క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట మండల స్థాయి ఆటలు పోటీల్లో బాలికల హైస్కూల్‌కు ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన నేపథ్యంలో బుధవారం కశింకోట గ్రామ సర్పంచ్ మంత్రి జయరజని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పిడి పెంటకోట సుజాత, బాలికల హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు స్వర్ణ కుమారి పాల్గొన్నారు.

అక్కినేని నాగేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యాన ప్రముఖ తెలుగు సినీ నటులు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అక్కినేని నాగేశ్వరరావు చిత్ర పటానికి బల్లా నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్నో గొప్ప అవార్డులు అందుకున్న వ్యక్తికి భారత ప్రభుత్వం భారత రత్న పురస్కారాన్ని ఈ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం పేదలకు బట్టలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఉజ్జి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వినకోట నీలేష్ గుప్తా, కార్యవర్గ సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణ మోహన్, పొట్టి శ్రీరాములు, అభిమాని పిరాట్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.


పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న నాగభూషణం తదితరులు

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ పరిధి వాడచీపురివల్లి నుండి విస్సన్నపేట వరకు రూ.82.60 లక్షలు పంచాయతీ రాజ్ నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బూసి అప్పలరాజు, వాడచీపురుపల్లి ఎంపీటీసీ గెడ్డం పుష్ప, పిఎసిఎస్ ఛైర్మన్ బురద రాజు, వైసిపి నాయకులు చుక్క రాము నాయుడు, కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, ఎంపీడీఓ హేమ సుందరరావు, సర్పంచ్‌లు సిరిపురపు అప్పలనాయుడు, పెదిశెట్టి పూజ శేఖర్, కుంద్రపు వరలక్ష్మి సీతారామయ్య, ఎంపీటీసీలు ఆర్లిల్లి దేవి, వరలక్ష్మి ఎరుకు నాయుడు, రవి, పైల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

జిల్లాస్థాయి ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఆట పోటీలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారు ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. క్రీడలు శారీరక మానసిక ఆరోగ్యాలకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సత్యారావు, జెడ్పిటిసి దొండ రాంబాబు, ఎంఈఓ కాశి, స్థానిక నాయకులు జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-చోడవరం : విద్యుత్తు లైన్లో మరమ్మతులు కారణంగా గురువారం చోడవరం ఫీడర్‌తో పాటు చాకిపల్లి, గవరవరం, అన్నవరం, దామనపల్లి గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ శివారు శృంగారపాడు గ్రామంలో సిద్ధి వినాయక విగ్రహం వద్ద సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా దంపతులు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొల్లి దేముడు, మొల్లి శంకర్, మొల్లి అప్పల నాయుడు, ఓయి బోయిన నగేష్, మొల్లి గంగునాయుడు, బొట్ట రమణ, మొల్లి సింహాద్రి, మొల్లి తాతబాబు, మొల్లి ఆదినారాయణ, మొల్లి గోపి పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి

'జగనన్నకు చెబుదాం'లో జిల్లా కలెక్టర్ రవి సుభాష్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంతో సమస్యలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ రవి సుభాష్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇంతవరకు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని కొంతమంది మాత్రమే ఉపయోగించు కుంటు న్నారన్నారు. గ్రామస్థాయిలో ఇంకను దీర్ఘకాలికంగా పరిష్కారం కానీ సమస్యలు మిగిలి పోతున్నాయన్నారు. వీటిని కూడా పరిష్కరించేం దుకు మండల స్థాయిలో ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమానికి అత్యధికంగా భూ సమస్యలతో ప్రజలు వచ్చారన్నారు.ఈ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల కోసం జిల్లా స్థాయి అధికారులతో సమీక్షలు ఏర్పాటు చేసి వీలైనంత త్వరలో దీర్ఘకాలిక వ్యవసాయ సమస్యలు పరిష్కరిస్తా మన్నారు. సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వడంపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. నాతవరం తదితర మండల కేంద్రంలో నిర్వహించిన జగనన్నకు చెబుతాం కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు 50 నుంచి 60 శాతం పరిష్కారం అయ్యాయని తెలిపారు. అక్టోబర్ 1 నుంచి ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సిబ్బందిని చైతన్య పరుస్తున్నామని చెప్పారు. మూడో విడత జగనన్న భూ హక్కుకు సంబంధించి జిల్లాలో 173 గ్రామాల భూములను రీ సర్వే చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. జిల్లాలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అందించేందుకు 303 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు కొత్త భవనాలు మంజూరు చేయగా 96 భవనాలు పూర్తయ్యాయన్నారు. రావికమతంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 282 మంది వివిధ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారని వీటన్నిటికీ తగిన పరిష్కారం చూపిస్తానని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం మరమ్మతు పనులు

ప్రజాశక్తి -రావికమతం: రక్షిత మంచినీటి పథకం మరమ్మతులను పంచాయతీ కార్యదర్శి స్వామి చేపట్టారు. కవగుంట గ్రామంలో ఇటీవల కాలంగా మరమ్మతులకు గురైన రక్షిత మంచినీటి పథకాన్ని బుధవారం వ ం ం వ ం త ం చేయడంతో ప్రజలకు తాగనీరు పూర్తి స్థాయిలో అందిం ది. ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి సూర్యకుమారి మాట్లా డుతూ, గ్రామం లో ఉన్న ఒకే ఒక రక్షితమంచి పథకం మరమ్మతు కావడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడే వారని, ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి స్వామి ధృష్టికి తీసు కెళ్లామన్నారు. చేతి బోరును కూడా మరమ్మతు చేయించడం జరిగిందన్నారు.



చేపడుతున్న పనులు



తనిఖీలు చేపడుతున్న హేమంత్

డిఎం అండ్ హెచ్ఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట పిహెచ్‌సిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ హేమంత్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, స్టోర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ కార్యక్రమాలతో పాటు, రక్త పరీక్షలు, పిల్లల ఒపీ, మందుల నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాక్సినేషన్ వయల్స్‌పై మార్కర్ తో డేట్ వేయాలని ఫార్మసిస్ట్ పద్మకు ఆదేశించారు. స్కూల్ పిల్లల్లో రక్తహీనత తక్కువగా వున్న పిల్లలకు ప్రతి రోజు ఐరన్ టాబ్లెట్స్ ఉపాధ్యాయులు వేయించే విధంగా పర్యవేక్షణ చేయాలని ఎంఈఓకు ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, గోడలపై పోస్టర్ లు తీసివేసి, బోర్డులు ఏర్పాటు చేయాలని, ఆసుపత్రి ఆవరణలో మొక్కలు వేయాలని వైద్యాధికారిణి రజనికి ఆదేశించారు.ఆసుపత్రి లో డెలివరీ లు, పిల్లల ఒపీ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఓ రామారావు, హెచ్ వి. విజయ తదితరులు పాల్గొన్నారు....

జూడో క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-రోలుగుంట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జూడో క్రీడా పోటీలు బుధవారం రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పిటిసి పోతల లక్ష్మీ రమణమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిఎస్ఎస్‌వి.ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కె.శ్రీరామూర్తి, శర్మ పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి నిరసనలు

ప్రజాశక్తి -అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా బుధవారం తెలుగుదేశం పార్టీ పార్లమెంటు కార్యాలయం నుండి అర్ధ నగ్నంగా కళ్ళకు గంతులు కట్టుకొని ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ రింగ్ రోడ్డు ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్‌లో గాంధీ విగ్రహం వద్ద చంద్రబాబుతో నేను అనే ప్లే కార్డులను ప్రదర్శిస్తూ జగన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న సీఐడీలను, పోలీసు ఉన్నత అధికారులను తన గుప్పిట్లో ఉంచుకొని అడ్డదారిగా తప్పుడు కేసులు పెట్టి చంద్రబాబును అరెస్టు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదంశెట్టి నీలబాబు, బొలిశెట్టి శ్రీనివాసరావు, నడిపెల్లి గణేశ్, సురే సతీష్, కోట్ని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా స్థానిక మెయిన్ రోడ్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి ఆరవ రోజుకు చేరుకున్నాయి. మెయిన్ రోడ్డుపై చెరకు గడలు చేత పట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమానికి జనసేన నాయకులు టెక్కలి పరశురాం సంఘీభావాన్ని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దాడి ముసలి నాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట విజయ్, ఆడారి లక్ష్మణరావు, మల్ల వరాహనరసింగరావు పాల్గొన్నారు.

యలమంచిలి : తెలుగుదేశం కార్యకర్తల యలమంచిలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. టిడిపి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు అధ్వర్యంలో వివిధ గ్రామాలనుంచి బైక్‌లపై వచ్చి నల్లజెండాలు చేతబట్టి యలమంచిలి శిబిరంలో కూర్చున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మొల్లేటి సత్యనారాయణ, కొర్రపాటి వీర రాజశేఖర్, పోతిన నాగ శివ, ఉల్లింగుల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : చంద్రబాబునాయుడు విడుదల కావాలని కోరుతూ మండలంలోని నీలకంఠాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తిరుమల వెంకటేశ్వర స్వామి వారిని వేడుకొని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కోట సత్యనారాయణ, పార్టీ నాయకులు పడాల గోవిందరావు, గోకాడ అప్పలనాయుడు, శివ పాల్గొన్నారు.

అనకాపల్లి : రాజ్యాంగానికి జగన్ రెడ్డి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని టిడిపి 84వ వార్డు ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలబాబు అన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచి, చట్టాలను అపహాస్యం చేసి చట్ట విరుద్ధ పరిపాలన చేయడంపై టిడిపి నాయకులు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోట్ని రాంబాబు, తలారి లక్ష్మీ ప్రసాద్, సబ్బవరపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను నిరసనగా అడ్డురోడ్డులో బీసీ నాయకులతో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. మండలంలో అడ్డరోడ్లులో అనకాపల్లి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు ఆధ్వర్యంలో బీసీ నాయకులతో రిలే నిరాహార నిరసన బుధవారం దీక్ష నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు అమలకంట్టి అబద్ధం, కోన అప్పలరాజు, అల్లు మోహన్ రావు, శ్రీనివాసరావు, కుప్పిశెట్టి వెంకటేష్, గోవిందరావు, లోవరాజు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఆర్‌కె బీచ్ కాళీమాత టెంపుల్‌కు ఎదురుగా సముద్రంలో టిడిపి కార్యకర్తలు జల దీక్ష చేపట్టారు. నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన తెలిపారు. పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

గోపాలపట్నం : విశాఖ పార్లమెంట్ వాణిజ్య విభాగం ఆధ్వర్యాన 'బాబుతో నేను' స్టిక్కర్, బాబు అక్రమ అరెస్ట్‌పై కరపత్రాలను విడుదలచేశారు. పశ్చిమ నియోజకవర్గంలో షాపుల వద్ద స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ వాణిజ్య విభాగ అధ్యక్షులు మొల్లేటి కుమార్‌స్వామి, దువ్వి కాళీప్రసాద్, నూనెల శ్రావణి, సూరి చంద్రశేఖర్, చరణ్, సంతోష్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేపట్టిన దీక్షలు బుధవారానికి 11 వ రోజుకు చేరాయి. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు గరే చంద్రమౌళి, అంగటి రాము, జి గోవిందరావు, టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడి నిర్వాసిత కాలనీలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ బోండా జగన్నాథం, ప్రసాదుల శ్రీనివాస్, రాజన్‌రాజు, విజయరామరాజు, సత్తిబాబు, రాంబాబు, డివి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

88వ వార్డు పరిధి గవర జగ్గయ్యపాలెంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, 88వ వార్డు కార్పొరేటర్ ముత్యాల నాయుడు, బండారు అప్పలనాయుడు, నరవ సత్తిబాబు, ఆళ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

22న సీతారాం రాక

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎపి ఎస్సిపిసీఆర్) సభ్యులు గొండు సీతారాం నర్సీపట్నంలో ఈ నెల 22 శుక్రవారం పర్యటించనున్నట్టు ఐసిడిఎస్ నర్సీపట్నం చైల్డ్ డెవలప్మెంట్ ప్రోజెక్ట్ అధికారి సువార్త తెలిపారు. వివిధ అంగన్వాడీ కేంద్రాలను సందర్శించనున్నారు. ఆర్డీవో కార్యాలయం సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిషేధ చట్టం, జి.ఓ.31 పై అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఏరియా ఆసుపత్రి, పాఠశాలలు సందర్శించే అవకాశం ఉందని తెలిపారు.

మహా సభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెలుగుల అర్జున్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని చీడిక గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి బుధవారం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 25 ,26, 27 తేదీలలో బాపట్ల పట్టణంలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ నక్కపల్లి మండల కార్యదర్శి అజయ్ పార్ధ, చీడిపల్లి చంటి, జనబాబు పాల్గొన్నారు.


గొలుగొండ: రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు కోరారు. గుండుపాల చెరువు గ్రామం వద్ద బికెయంయు గోడపత్రిక విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శెట్టి పైడియ్య, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి- నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం సప్పరం వాహనంపై శ్రీనివాసుడి తిరువీధి సేవ వైభవంగా జరిగింది. స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సప్పరం వాహనంపై మాఢ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, నండూరి రాజ గోపాలాచార్యులు, రేజేటి సింగరాచార్యులు, శివాలయం చైర్మన్ వెంకటేశ్వరరావు, గురుభవానీ డి.రాంబాబు పాల్గొన్నారు.



మిషన్‌ను అందజేస్తున్న తల్లిదండ్రులు

ఆదర్శ పాఠశాలకు వితరణ

ప్రజాశక్తి -రావికమతం: మరుపాక ఆదర్శ పాఠశాల లో చదువుకొని త్రిపుల్ ఐఐటీ సీటు సంపాదించుకున్న హేమసాగర్ వేయింగ్ మిషన్‌ను పాఠశాలకు బహుమతిగా అందించారు. మండలంలో కేబిపి అగ్రహారం గ్రామానికి చెందిన హేమసాగర్‌ను పిన్సిపాల్ కే.సత్య సునీలు, పాఠశాల సిబ్బంది పలువురు అభినందించారు.

రుణాల వసూలు వేగవంతం

ప్రజాశక్తి-రోలుగుంట: వచ్చే నెల 15వ తేదీ లోపు స్త్రీ నిధి రుణాల వసూళ్ల వేగవంతంగా చేపట్టాలని డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా గ్రూపు సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్త్రీనిధి రుణాలను వేగవంతం వసూలు చేసేలా కృషి చేయాలన్నారు. విరివిగా సంఘాలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

41ఎ నోటీసు రద్దు చేయాలి

ప్రజాశక్తి -కొత్తకోట:ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ చట్టంలో 41 ఏ నోటీసును రద్దు చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ సేవా సంఘం సభ్యలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా దళిత సేవా పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు యాదగిరి దాసు, డీకేఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ జడ్పిటిసి చిట్ల చలపతి, నర్సీపట్నం డివిజన్ దళిత నాయకులు మార్తి అప్పల రాజు తదితరులు మాట్లాడుతూ, ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో అధికారులు తీరు అక్షేపనియమన్నారు. చట్టాలను నీరు గార్చే విధంగా వీరంతా వ్యవరిస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 23 నర్సీపట్నంలో జరిగే జిల్లా దళిత సంఘాల ఐక్య సమావేశం జయప్రదం చేయాలని కోరారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంబేద్కర్ సంఘం సభ్యులు బి. బుల్లిబాబు, పూడి అప్పారావు, యూత్ సభ్యులు ఎన్, శివ, జి.మోసే తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప తహశీల్దార్

సమగ్ర భూ సర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో నిర్వహిస్తున్న జగనన్న భూ సర్వే వేగవంతం చేయాలని ఉప తహసిల్దార్ సోమశేఖర్ సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేజ్ సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న సర్వే పట్ల నిర్లక్ష్యం చేయరాదని, త్వరిత గతిన సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే స్టోన్ ప్లాంటేషన్ అవుతున్న గ్రామాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వివాదాలకు తావు లేకుండా సర్వే నిర్వహించాలన్నారు. ఇంతవరకు సర్వే గ్రామాలలో ఏదైనా పొరపాట్లు తప్పులు ఉన్నట్లయితే సరి చేయాలన్నారు. జగనన్నకు చెబుతాం లో వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఒ

80 శాతం రాయితీపై విత్తనాలు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలో రైతుల సమస్యలపై మండల స్థాయి అధికారులతో బుధవారం తహసిల్దార్ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి సౌజన్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నారు మడులు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం ప్రత్యామ్నయంగా 80 శాతం రాయితీ పై విత్తనాలు అందజేయడం జరుగుతుందని ఎఒ తెలిపారు. రైతులు తమ దగ్గర లోని ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ప్రత్యామ్నయంగా చిరు ధాన్యాలు, అపరాలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ విజయకుమార్, డిప్యూటీ తహసిల్దార్ శ్యాం కుమార్, మండల నీటిపారుదల శాఖ అధికారి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకట లక్ష్మమ్మ

ప్రజాశక్తి-రావికమతం:మండలంలోని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సహిత విద్యా విభాగం వనరుల గదిలో దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్లు, ఎం.ఆర్ కిట్లు, వినికిడి యంత్రాలను అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.వెంకట లక్ష్మమ్మ అందజేశారు. తరగతి గదిలోని విద్యార్థులు బోధన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల నోట్ బుక్స్ ను పరిశీలించారు. పాఠశాలలో నాడు నేడు పనులను పర్యవేక్షించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ- సమగ్ర శిక్ష భవితా కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలు, సదుపాయాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఉచితంగా ఉపకరణాలను, అలవెన్సులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. వీటిని ప్రత్యేక అవసరాల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థుల అభివృద్ధికి అందరూ తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా విద్యాశాఖ సూపరింటెంట్ వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారులు సి.హెచ్ తలుపులు, బ్రహ్మాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రామారావు, స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు, సిఆర్పిలు రామారావు, శ్రీను, చిలుకమ్మ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



వీల్ చైర్లు అందజేస్తున్నడిఇఒ

ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలోని ఎంకె.పట్నం శివారు చటర్జీపురం దబ(పివిటిజ) గిరిజనులకు, కొయ్యూరు మండలం వైసిపి జెడ్పీటీసీ వారా నూకరాజుల మధ్య బుధవారం భూసమస్యలపై ఘర్షణ జరిగింది. ఎంకె.పట్నం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 139లో 10 ఎకరాల 29 సెంట్ల భూమి గత మూడు తరాలుగా గిరిజనులు నాలుగు కుటుంబాల వారు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ భూమిలో జమ తోట, అరటి సాగు చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ప్రస్తుత జెడ్పీటీసీ వారా నూకరాజు తాను ఆ భూమిని కొనుగోలు చేశానని, సాగు నుండి వెళ్లిపోవాలని ఎన్నో సార్లు బెదిరించాడని గిరిజనులు తెలిపారు. ఈ నెల 18న వచ్చి మరలా బెదిరించాడు. ఈ నేపథ్యంలో బుధవారం వారా నూకరాజు అతని అనుచరులు 100 మంది వరకు వచ్చి పంటలను ధ్వంసం చేశారు. పంటను నాశనం చేయడం ప్రాదేయపడినా వినలేదని వారు వాపోయారు. ఈ కొట్లాట విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ధ్వంసమైన తోటలు

ఆదివాసీలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి -రోలుగుంట:కొయ్యూరు వైసిపి జెడ్పీటీసీ వారా నూకరాజు భూ ఆక్రమణ నుండి ఆదివాసీలకు రక్షణ కల్పించాలని అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోసురి రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కొయ్యూరు మండలంకు చెందిన వారా నూకరాజు గతంలో సిపిఐలో పని చేసి అనంతరం అధికార పార్టీలో చేరి కొయ్యూరు జెడ్పీటీసీగా పదవి పొందారన్నారు. అప్పటి నుండి కొయ్యూరు, నర్సీపట్నం, గొలుగొండ, రోలుగుంట మండలాలో భూకబ్జాలు, దందాలు మొదలు పెట్టారన్నారు. రోలుగుంట మండలం ఎంకె.పట్నం శివారు చటర్జీపురం ఆదివాసీల సాగులో ఉన్న భూములపై కన్నేసి చాలా కాలంగా అక్కడి ఆదివాసీలను వేధిస్తున్నారన్నారు. తన రాజకీయ పలుకుబడితో కేసులు నమోదు కాకుండా రికార్డులలో ఆదివాసీల పేర్లు తీయించి వారిని బెదిరిస్తున్నారన్నారు. పలుమార్లు కిరాయి మనుషుల తీసుకొని ఆదివాసీల పంటలు నాశనం చేయిస్తూ వస్తున్నారన్నారు. ఇతనిపై పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్ పైన ఆదివాసీలు నర్సీపట్నం కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు దాఖలు చేసారన్నారు. ఈ నెల 18న అతని కుటుంబ సభ్యులు కొందరు వచ్చి కేదారి రాజు వేసుకున్న అరటి తోటను ధ్వంసం చేసారన్నారు. బుధవారం కూడా కొంత మంది కిరాయి మనుషులతో వచ్చి జీడిమామిడి, అరటి, జామ తోటలను మరల ధ్వంసం చేసారన్నారు.వారా నూకరాజుపై తగు చర్యలు తీసుకొని ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మెయిన్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీస్ జంక్షన్ వరకు ఉన్న రోడ్డును 60 అడుగుల వెడల్పుతో విస్తరించే పనులు జోరందుకున్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రోడ్డును వెడల్పు చేసి విస్తరించాలని స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కొన్నాళ్ళుగా ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. 80 అడుగుల వెడల్పుతో రోడ్డును విస్తరింప చేయాలని ఆయన భావించారు. ఈ మేరకు మార్కింగ్ పనులు కూడా జరిగాయి. అయితే దీనికి రోడ్డుకు అటు ఇటు ఉన్న భవనాల, వ్యాపార సంస్థల వారు అభ్యంతరం తెలిపారు. అంతగా రద్దీ లేని ఈ రోడ్డును 80 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయవలసిన అవసరం లేదని అభ్యంతరం చెప్పారు. పలుమార్లు భవనాలు కోల్పోనున్న వారితో ఎమ్మెల్యే, జివిఎంసి అధికారులు సమావేశాలు నిర్వహించారు. ఎట్టకేలకు 60 అడుగుల వెడల్పుతో విస్తరణ చేయడానికి అంగీకరించారు. దీంతో రోడ్డు విస్తరణకు అధికారులు సన్నాహాలు చేశారు. అయితే రోడ్డు విస్తరణలో కోల్పోతున్న తమ ఆస్తులకు నష్టపరిహారం నగదు రూపంలో చెల్లించాలని కొందరు వ్యాపారస్తులు పట్టుబట్టారు. జివిఎంసి వారు మాత్రం నగదు బదులు టిడిఆర్ ఇస్తామని ప్రకటించారు. అందుకు కొందరు యజమానులు అంగీకరించారు. కొందరు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో పలు దఫాలు భవనాల యజమానులతో చర్చలు జరిగాయి. అవి ఫలించడంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అయితే జివిఎంసి కాకుండా స్వచ్ఛందంగా తామే మార్కింగ్ మేరకు భవనాలను తొలగిస్తామని, అందుకు అయ్యే ఖర్చును, అలాగే డెబ్రిష్ తొలగింపు ఖర్చును జివిఎంసి భరించాలని భవనాల యజమానులు కోరారు. నష్టపరిహారం చెల్లిస్తున్నాంగనుక భవనాల తొలగింపు పనులకు తాము ఎటువంటి నిధులూ ఇచ్చేది లేదని, డెబ్రిష్ మాత్రం తొలగిస్తామని జివిఎంసి అధికారులు చెప్పడంతో యజమానులు అంగీకరించారు. దీంతో భవనాల తొలగింపు కార్యక్రమాన్ని యజమానులే స్వయంగా దగ్గరుండి చేయించుకుంటున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్డులో పూర్ణా మార్కెట్, కురుపాం మార్కెట్ ప్రాంతాలలో రోడ్డు ఇరుకుగా ఉంది. దీంతో ఎక్కువ మేర భవనాలను తొలగించాల్సి వస్తోంది. తాజా లెక్కల ప్రకారం 225 భవనాలను అటు, ఇటు పాక్షికంగా తొలగించాల్సి ఉంది. ఎలాగైనా రెండు లైన్లతో రోడ్డును అభివృద్ధి చేయాలన్న ప్రణాళికతో జివిఎంసి ముందుకెళ్తోంది.



కొనసాగుతున్న భవనాల తొలగింపు ప్రక్రియ

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-గొలుగొండ:హ్యాండ్ బాల్ పోటీల్లో గొలుగొండ మండలం చోద్యం హైస్కూల్ విద్యార్థిని పైల మౌనిక ప్రతిభ కనబర్చింది. ఈ నెల 19న ఎంజెపిబిసిడబ్ల్యూఆర్ స్కూల్లో జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ సెలక్షన్‌లో మౌనిక అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైందని పాఠశాల పిఈటి నూకరాజు పేర్కొన్నారు. మౌనికను హెచ్ఎం ఎం.రత్నాజీ అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



పట్టుబడ్డ ట్రాక్టర్

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో గొట్టువాడ గ్రామం వరాహనది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరుని స్థానిక పోలీసులు పట్టుకొని స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై నారాయణరావు మాట్లాడుతూ, అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవన్నారు.



బహుమతులు ఇస్తున్న రమణ

ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట గ్రామంలో లవర్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు అనిమిరెడ్డి రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విజేతలకు సొంత నిధులతో అనిమరెడ్డి రమణ, వార్డ్ సెక్రటరీ చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో చేసే కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.